# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 126 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

17-03-2026 మంగళవారం వెల : 1 /- పేజీలు : 4


## గ్రామ్ జీ చట్టంపై షర్మిలా తీవ్ర విమర్శలు

- మన్రేగా పునరుద్ధరణ వరకు పోరాటం ఆగదు: ఏపీసీసీ చీఫ్
- మన్రేగా చట్టానికి గ్రామ్ జీ చట్టానికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా
- గ్రామ స్వరాజ్యాన్ని నాశనం చేసేలా మోడీ ప్రభుత్వం చర్యలు
- చంద్రబాబు, పవన్, జగన్ ముగ్గురు కలిసి రాష్ట్ర ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారు
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి హామీని 150 రోజులకు పెంచుతాం





**నవతరం -ఆమదాలవలస**

శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస నియోజకవర్గం కొర్లకోట గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (మన్రేగా)ను నిర్వీర్యం చేసి, దాని స్థానంలో కేంద్రం తీసుకొచ్చిన గ్రామ్ జీ చట్టం గ్రామ స్వరాజ్యాన్ని నాశనం చేసే చట్టమని ఆమె పేర్కొన్నారు. మన్రేగా చట్టం గ్రామాల అభివృద్ధికి



కీలకమైందని, పనుల నిర్ణయాధికారం గ్రామసభలకే ఉండేదని చెప్పారు. అయితే కొత్తగా తీసుకొచ్చిన -మిగతా 2లో

## పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా నివాళులు

- ఓబిఎస్ వద్ద ఉన్న విగ్రహానికి మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పూలమాల వేసి నివాళులు
- తెలుగు జాతి కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు
- జాతి చరిత్రను కొత్త తరాలకు తెలియజేయాల్సిన అవసరం
- 57 రోజుల నిరాహార దీక్షతో ఆంధ్ర రాష్ట్ర సాధనకు మార్గం
- పొట్టి శ్రీరాములు త్యాగం తెలుగు జాతికి మార్గదర్శకం

**నవతరం -శ్రీకాకుళం**

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా నగరంలోని ఓబిఎస్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జాతి తన చరిత్రను కొత్త తరాలకు తెలియజేస్తూ ఉండాలని అన్నారు. ఒక జాతి పురోగమించాలంటే ఆ జాతి నిర్మాణంలో త్యాగాలు చేసిన మహనీయుల పాత్రను గుర్తుచేసుకోవడం అవసరమని పేర్కొన్నారు. అందుకే పొట్టి శ్రీరాములు జయంతిని ఇప్పటికీ ఘనంగా జరుపుకుంటున్నామని చెప్పారు. మద్రాస్ ప్రాంతంలో తెలుగువారిని నిర్లక్ష్యం చేసిన కాలంలో వారి గౌరవం కోసం పొట్టి శ్రీరాములు గారు నిరాహార దీక్ష చేపట్టారని తెలిపారు. రాజాజీ పాలనలో ఉన్న కఠిన పరిస్థితుల్లో కూడా గుండె ధైర్యంతో పోరాడి 57 రోజులపాటు నిరాహార దీక్ష చేసి తెలుగు జాతి కోసం ప్రాణత్యాగం చేశారని అన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం వల్లే తెలుగు ప్రజలకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం సాధ్యమైందని, నేడు రెండు తెలుగు రాష్ట్రాలు కొనసాగుతున్నాయంటే ఆయన చేసిన త్యాగమే ప్రధాన కారణమని



ధర్మాన పేర్కొన్నారు.

తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ఇటువంటి మహనీయుల త్యాగాలను తెలియజేస్తూ ఉండాలని, సమాజం వారి గొప్పతనాన్ని ఎప్పటికీ స్మరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు గారికి మరోసారి నివాళులర్పించారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం తెలుగు జాతికి శాశ్వత ప్రేరణ

### 125వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**నవతరం -శ్రీకాకుళం**

అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు ప్రజల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిన పొట్టి శ్రీరాములు త్యాగం భారత చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆయన చేసిన నిరాహార దీక్ష, అచంచల సంకల్పం తెలుగు జాతి చరిత్రలో అజరామరంగా నిలిచిపోయిందని కొనియాడారు. పొట్టి శ్రీరాములు మహోన్నత త్యాగానికి గుర్తింపుగా నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలో 58 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం చారిత్రాత్మక ఘట్టమని మంత్రి తెలిపారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి చిహ్నంగా నిలిచేలా ఈ విగ్రహం తరతరాలకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. 1952లో ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆయన 58 రోజులపాటు నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలను అర్పించారు. ఆయన త్యాగం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమై, చివరకు 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడేందుకు మార్గం సుగమమైంది. భాషా ఆధారంగా రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణకు కూడా ఆయన త్యాగం ప్రధాన కారణంగా నిలిచింది. ఆయన త్యాగం వల్లే ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావం సాధ్యమైందని, తెలుగు జాతి చరిత్రలో ఆయన స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుకు రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## ఏపీ అంటే డ్రగ్స్‌కు అడ్డా..

- డ్రగ్స్ సేవించిన ఎంపీ పుట్టా మహేష్‌కు కఠినంగా శిక్షించాలి
- వైయస్సార్ సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన రావు



**నవతరం -పలాస**

ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీ డ్రగ్స్ మాఫియాకు ప్రధాన కేంద్రంగా మారుతోందని చెప్పడానికి.. తెలుగుదేశం -మిగతా 2లో

## దానేటి దాతృత్వం గొప్పది



- 8.5 లక్షల విలువ చేసే మంచినీటి ట్యాంకు అందించడం అభినందనీయం
- ఆమదాలవలస అంటే డాక్టర్ శ్రీధర్‌కు ఎంతో అభిమానం
- ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్
- ఎమ్మెల్యే రవికుమార్ దూరదృష్టి, పరిపాలన దక్షత అమోఘం
- ప్రముఖ గైనిక్ వైద్యనిపుణులు, డాక్టర్ దానేటి శ్రీధర్
- ఎమ్మెల్యే రవికుమార్‌తో కలసి మంచినీటి ట్యాంకర్ ప్రారంభించిన డాక్టర్ దానేటి శ్రీధర్

3లో

## అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలి



4లో

## మాల్‌ఖానా భద్రతా ఏర్పాట్లపై జిల్లా జడ్జి తనిఖీ

3లో



ఎడిటోరియల్

# స్వేచ్ఛకు అధికార ఆంక్ష!

ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రశ్నించే గొంతు కీలకం. అది మౌనంగా మారితే ప్రమాదకరం. అక్షరంతో, మాటతో, వ్యంగ్యంతో ప్రభుత్వాన్ని అద్దంలో చూపించే హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణం. కానీ, నేడు ఆ హక్కుపై కత్తి వేలాడుతున్న దృశ్యం చర్చనీయాంశం. ప్రముఖ రాజకీయ కార్టూనిస్టు సతీష్ ఆచార్యకు కేంద్రం మొన్న నోటీసులు జారీచేసింది. మూడురోజుల్లో వాటికి సమాధానమివ్వాలంటూ ఆదేశించింది. ఆయన చేసిన నేరం- ప్రధాని మోడీపై కార్టూన్లు వేయడమే! ఇది మీడియా స్వతంత్రతను హరించడమే కాదు, రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛను భంగపరచడమే అవుతుంది. ప్రజాస్వామ్యానికి శాసన, కార్యనిర్వహక, న్యాయవ్యవస్థలు మూడు స్తంభాలైతే, నాలుగో స్తంభంగా మీడియాను చెప్పుకుంటాం. కానీ, ఆ స్తంభాన్నే పడగొట్టే చర్యలకు పాల్పడటం ఆందోళనకరం. పత్రికలకు ఎంత స్వేచ్ఛ ఉంటే ప్రజాస్వామ్యం అంత బలంగా ఉంటుంది. అధికారాన్ని ప్రశ్నించే స్వరం లేకపోతే అది కేవలం ఎన్నికల ప్రక్రియగానో, లేదంటే రాచరిక వ్యవస్థగానో మిగిలిపోతుంది. గతంలో న్యూస్‌క్లిక్ విషయంలో, ఆనంద్ వికటన్ అంశంలో, తాజాగా సతీష్ ఆచార్య విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఒక్కటే- తమనెవరూ ప్రశ్నించకూడదు, అడ్డు చెప్పకూడదన్న ధోరణి. సతీష్ ఆచార్య వేసిన కార్టూన్లలో ప్రధానికి పరువుకు నష్టం కలిగించే భావం ఏదైనా ఉందా అంటే లేనేలేదు. కానీ, అది రాజకీయంగా ఇరకాటంలో పెట్టింది. అమెరికా-ఇజ్రాయిల్ కలిసి ఇరాన్‌పై యుద్ధం చేస్తున్న క్రమంలో మన విదేశాంగ విధానాన్ని ప్రశ్నిస్తూ, మోడీనుద్దేశించి ఆచార్య కార్టూన్లు వేశాడు. 'ఒకప్పుడు ఇరాన్ మన మిత్రుడంటూ పేర్కొన్న భారత ప్రభుత్వం, ఇప్పుడు ఖమేనీ హత్యపై మౌనం దాలుస్తోంది. హిందూ మహాసముద్ర తీరంలో ఇరాన్ యుద్ధనౌక ఐరిస్ దేనాను అమెరికా జలాంతర్గామి ముంచివేసిన ఘటనపై ప్రధాని మోడీ మౌనంగా వహిస్తున్నారు...' అనేది ఆయన కార్టూన్లలోని సారాంశం. ఇదే మోడీ సర్కార్‌కు ఆగ్రహాన్ని తెప్పించింది. వీటిని వెంటనే ఎక్స్ ఖాతా, సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలంటూ ఆచార్యను ఆదేశించింది. రెండు వారాలుగా ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధ తంత్రం తెలిసిందే. అక్కడి మృత్యుకేకలు ఇక్కడ మానవ హృదయాలను కూడా కదిలిస్తున్నాయి. అక్కడ ఎగుస్తున్న చమురు సెగలు మన వంటిల్లును కూడా తాకుతున్నాయి. పెట్రోల్ తిప్పలు, గ్యాస్ సిలిండర్ల కొరత, సామాన్యుల అగచాట్లు కనిపిస్తూనే ఉన్నాయి.

ఈ పరిణామాలపై నోరు విప్పాలని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే పార్లమెంట్ నుంచి పలాయనం చిత్తగించాడు మన ప్రధాని! మరి ఈ కల్లోలానికి కారణాల్లో, మన వైఖరి కూడా ఒకటికదా! అడగాల్సిన బాధ్యత మీడియాదే కదా! కార్టూన్ కూడా మీడియా వ్యక్తీకరణలో ఒక ముఖ్యమైన రూపం. చిన్న చిత్రం అయినా దానివెనుక పెద్ద అర్థం ఉంటుంది. వ్యంగ్యంతో రాజకీయ వైరుధ్యాలను బయటపెట్టడం కార్టూనిస్టుల పాత్ర. అందుకే ఆచార్య కూడా 'కార్టూన్లు గీయడానికి, ప్రచురించడానికి నాకు హక్కు ఉంది. నోటీసులు పంపడం భావప్రకటనా స్వేచ్ఛను ఉల్లంఘించడమే' అన్నారు. మనకు రాజ్యాంగంలోని అర్టికల్ 19(1)ఎ వ్యక్తిస్వేచ్ఛ, మాట్లాడే స్వేచ్ఛ, అభిప్రాయం వ్యక్తం చేసే స్వేచ్ఛ, ప్రభుత్వాన్ని విమర్శించే స్వేచ్ఛను ఇచ్చింది. ఇవన్నీ ఆ హక్కులో భాగమే. జర్నలిస్టులు, రచయితలు, కార్టూనిస్టులు ఈ హక్కును వినియోగిస్తూ సమాజంలో జరుగుతున్న పరిణామాలను విశ్లేషిస్తారు, వివరిస్తారు, అవసరమైతే ప్రశ్నిస్తారు కూడా. దాన్ని జీర్ణించుకోలేకపోవడం, కక్షసాధింపుతో వ్యవహరించడం కేంద్రానికి సరికాదు. కార్టూన్ అనేది కేవలం చిత్రం కాదు, అది ఒక రాజకీయ వ్యాఖ్య. ఒకే ఫ్రేమ్‌లో రాజకీయ వైఖరులను బయటపెడుతుంది.

అందుకే ప్రపంచ వ్యాప్తంగా కార్టూనిస్టులు ప్రజాస్వామ్య చర్చలో కీలకపాత్ర పోషించారు. కానీ, మోడీ అధికారంలోకి వచ్చిన ఈ పన్నెండేళ్ల కాలంలో వీటిని సహించని స్థితి పెరిగిపోయింది. ఇదే కాదు, గతేడాది తమిళనాడుకు చెందిన ఆనంద్ వికటన్ అనే డిజిటల్ మీడియా ఒక రాజకీయ వ్యంగ్యాన్ని ప్రచురిస్తే ఆ రాష్ట్ర బీజేపీ కేసువేసి వెబ్‌సైట్‌ను బ్లాక్ చేయించింది. పత్రికా యాజమాన్యం కోర్టుకెక్కగా మళ్లీ పునరుద్ధరణకు నోచుకుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారంటూ న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్తను అరెస్టు చేసి జైల్లో వేసింది. ఇలా చూస్తే పత్రికారంగం ఉంటే తమకు అనుకూలంగా ఉండాలి, లేదంటే మూసేసుకోవాలన్న పద్ధతిలో కేంద్రం కక్షతో వ్యవహరిస్తోంది. కానీ, వాస్తవం ఏమిటంటే ప్రశ్నలను అణచడం ద్వారా సత్యాన్ని దాచలేరు.

కార్టూనిస్టులకు నోటీసులు పంపడం, వెబ్‌సైట్‌లను బ్లాక్ చేయడం, జర్నలిస్టులపై కేసులు పెట్టడం, ఇవన్నీ తాత్కాలికంగా విమర్శలను తగ్గించొచ్చు. కానీ, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తాయి. అందుకే ప్రశ్న శత్రుత్వం కాదు, సవరణకు మార్గం. ఆ ప్రశ్నకు అండగా నిలబడటం ప్రభుత్వ బాధ్యత, కాపాడుకోవడం ప్రజల కర్తవ్యం.

# వాన బొట్టు



(ఆణిముత్యం ఆశల దీపం)

ఆకాశపు అంచు నుండి
జారింది వానబొట్టు ఆణిముత్యంలా...

భూమిని తాకింది వేగంగా
మేఘాలవిలుకాడు వదిలిన బాణంలా...

మెల్లగా ఆకులపై వాలింది
చిరుగాలిలో తేలే హంసలా...

దిశలన్నీ నిండింది, మట్టి
వాసనను మోసుకొచ్చే సుగంధంలా...

అలలతో జతకట్టింది
సముద్రపు ఒడిలో కలిసే బిడ్డలా...

కప్పులపై శబ్దం చేసింది
కమ్మని రాగాలను పలికించే గాయనిలా...

పచ్చని ప్రకృతికి ప్రాణం పోసింది
మెళ్ళో మెరిసే రత్నంలా
పుడమితల్లి పులకించేలా...

కుంభవర్షమై కురిసింది ఎండిన
జీవకోటి గొంతుకకు ప్రాణవాయువులా...

తపించే ధరణి దాహాన్ని తీర్చింది
వరప్రదాయినిలా అమృతపు ధారలా...

పచ్చని పైరును ముద్దాడింది.
రైతు కళ్లలో వెలిగే ఆశల దీపంలా...



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# అనంతపురం జిల్లా తాడిపత్రిలో....
# ఆలూరుకోన శ్రీరంగనాథస్వామి





**భూ**లోకం సుభిక్షంగా ఉండడం కోసం, ప్రజలు ఆనందంగా జీవించడం కోసం, యాగాలనాచరించడమే కర్తవ్యంగా భావించి నిరంతరం భగవంతుడికి ప్రజలకు సేవలు చేసే సంకల్పమున్న మహర్షులు ఎందరో ఉన్నారు. వారి కోవకు చెందిన వారే విశ్వామిత్ర మహర్షి ఒకసారి ఒక దట్టమైన వనంలో యాగం చేయడానికి సంకల్పించారు. ప్రజలు సంతోషంగా జీవించడం నచ్చని తాటకి అనే రాక్షశి తన తమ్ముడైన మారీచుడిని, మరి కొందరు రాక్షసులను పిలిచి యాగాలను ఛిన్నా భిన్నం చేయమని ఆజ్ఞాపించింది. మారీచుడు తదితరులు మహర్షులు లోక సంరక్షణార్థం చేసే యాగాలను ప్రతీసారి ధ్వంసం చేసి మునులను ఇక్కట్లు పాలు చేసేవారు.

ఎన్నిమార్లు యాగాన్ని మొదలు పెట్టినా ఏదో ఒక అవాంతరం వాటిల్లి యాగాన్ని ముగించ లేకపోయారు మహర్షులు. ఈ అన్యాయాలకు తాటకి మూలకారకురాలని తెలుసుకున్నాడు విశ్వామిత్రుడు. తన దివ్య దృష్టితో భవిష్యత్తులో జరిగే సంఘటనలు తెలుసుకున్నారు. వెంటనే అయోధ్యకు వెళ్ళి దశరథమహారాజుని కలుసుకుని తాటకి చేస్తున్న అక్రమాలను అరికట్టడానికి బాలురైన రామలక్ష్మణులను పంపి, లోకాన్ని రక్షించమన్నాడు విశ్వామిత్రుడు.

బాలురైన రామలక్ష్మణులను రాక్షసిని సంహారం చేయడానికి పంపడానికి సంకోచించాడు దశరథమహా రాజు, రాజు వంశ కులకురువైన వశిష్ఠుడు ధైర్యం చెప్పగా బాలురను విశ్వామిత్రుని వెంట అడవులకు పంపాడు దశరథ మహారాజు.

రామలక్ష్మణులు తమ ధనస్సు తీసుకుని విశ్వామిత్రుడి వెంట యాగశాలఉన్న దట్టమైన అడవికి బయల్దేరారు.

విశ్వామిత్రుడు మరో మారు యాగాన్ని ప్రారంభించాడు. తాటకి తన అనుచర రాక్షసులతో అక్కడికి వచ్చింది. అసుర సంహారం కోసం వచ్చిన రాముడు యాగన్ని ఆపడానికి వచ్చింది ఒక స్త్రీ అని తెలుసుకొని వెనుకంజవేయగా, విశ్వామిత్రుడు భుజం తట్టి రాక్షసిపై విల్లు ఎక్కుపెట్టమని ఆజ్ఞాపించాడు. మహర్షి మాట కాదనలేక బాణము గురిపెట్టాడు రాముడు.

రాముని బాణం భారీకాయురాలైన తాటకికి తగిలి నేలకొరిగింది. వైకుంఠనాథుని చేత మరణం వాటిల్లినందువల్ల మోక్షం పొందింది. తాటకి సంహారం గురించి తెలుసుకున్న మిగిలిన అనుచరులు పరుగు లంఘించారు. యాగం మొదలైంది. నిరాటంకంగా సాగింది.

## ఆలయ చరిత్ర

అసుర సంహార దోషపరిహారం కావించడానికి ఒక శివలింగాన్ని ప్రతిష్ఠించమని చెప్పారు విశ్వామిత్రుడు. తాటకిని సంహరించి, ఆమె ప్రాణాలు వదలిన స్థలంలో శివలింగాన్ని ప్రతిష్ఠ చేయడానికి నిశ్చయించుకుని తగిన చోటు కోసం వెదికాడు.రాముడు.

పెన్నానది ఒడ్డున అడుగుపెట్టిన రాముడు ఒక చిన్న ప్రాంతంలో ఉన్న ఒక బుగ్గలో కైలాస నాథుడు స్వయంభువ లింగరూపంలో దర్శనమివ్వడంతో పరమానంద భరితుడయ్యాడు. పరుశురాముడు పూజించిన స్వయంభవు లింగం అదే అని తెలుసుకున్న విశ్వామిత్రుడు ఆ లింగాన్ని అక్కడే ప్రతిష్ట చేయమని చెప్పాడు. ఆ లింగాన్ని ప్రాణప్రతిష్ట చేసి పూజలు భక్తితో చేశాడు రాముడు. అసుర సంహారం వల్ల అదీ ఒక స్త్రీని సంహరించినందువల్ల పొందిన దోషం పరిహారమయ్యింది. ఆ తర్వాత అయోధ్యకు వెళ్ళే మార్గంలో విశ్వామిత్రుడి మార్గదర్శకత్వంలో రాముడు జనక మహారాజు కుమార్తె జానకిని స్వయంవరంలో గెలిచి పరిణయమాడాడు శ్రీరాముడు. తాటకికి మోక్షం శ్రీరాముడి పరిణయం ఈ దృశ్యాలన్నిటిని విశ్వామిత్రుడు తన దివ్యదృష్టితో ఏనాడో తెలుసుకున్న విషయాలు. తాటకికి మోక్షప్రాప్తి లభించిన చోటే ఈనాడు తాడిపత్రిగా పరిగణించబడుతుంది. ఇక్కడ రాముడు ప్రాణప్రతిష్ఠ చేసి పూజించిన లింగాన్ని రామలింగం అంటారు.

## ఆలయ నిర్మాణం

పురాణకథ ప్రకారం ఈ పుణ్యక్షేత్రం 14వ శతాబ్దంలో పాలించిన ఎర్రమ్మ తిమ్మరాజు అనే రాజు ఆలయాన్ని నిర్మించాడు. ఆ ఆలయంలో తాటకికి మోక్షానిచ్చిన వైకుంఠవాసుడు శ్రీరాముడికి కులదైవమైన శ్రీరంగనాథుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కొండపై చిన్న ఆలయద్వారం దాకా మనం వాహనాల్లో వెళ్ళగలిగేంత సౌకర్యంగా ఉన్నాయి రహదారులు.

## ఎలా వెళ్ళాలి ?

తాడిపత్రి నుండి ఆరు కి.మీ. దూరంలో ఉన్న ఆలూరు కోన దట్టమైన అడవిలో పక్షులు కిలకిలరావాలు మధ్య ప్రయాణం చేయాలి. సహజమైన ప్రకృతిని ఆస్వాదిస్తూ కోనను చేరుకోవచ్చు.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# టెక్కలిలో బీజేపీ బలోపేతము.
# ముమ్మరముగా పార్టీలో చేరికలు



మండల బిజెపి నాయకత్వం

**నవతరం టెక్కలి**

భారతీయ జనతా పార్టీ బలోపేతం దిశగా టెక్కలి నియోజకవర్గంలో ముమ్మరముగా చేరికలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా టెక్కలి బీజేపీ మండల అధ్యక్షుడు మరియు కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జర్జాన రాంజీ ఆధ్వర్యంలో టెక్కలి బీజేపీ కార్యాలయంలో పలువురు యువకులు బీజేపీ పార్టీలో చేరారు.ఈచేరిక కార్యక్రమంలో జర్జాన రాంజీ వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలిపారు. బీజేపీ సిద్ధాంతాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై మరిన్ని యువత పార్టీ వైపు వస్తున్నారని చెప్పారు. టెక్కలి ప్రాంతంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి అందరూ కలిసి పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిలుగా కిషన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అన్నెపు ఉమామహేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు నడుపూర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉపాధ్యక్షులు ఆకులు ప్రకాష్, ఒడిసి బాబూరావు, సంపత్ రావు రమేష్, పిట్ట రామ్మోహన్ రావు, అరి వెంకట్, ఆరంగి తిరుపతిరావు లవ కుమార్ జాయిన్ అయిన సభ్యులు డోకు మురళి, పోలాకి ఈశ్వరరావు, ముడి మంచి ముడి మణికంఠ, గోవింద్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# చుక్కల కథ – మనిషి జీవితం



ఒక చిన్న గ్రామంలో రామయ్య అనే వ్యక్తి ఉండేవాడు. చిన్నప్పటి నుంచే అతని జీవితం కష్టాలతో నిండిపోయింది.
చదువు మధ్యలో ఆగిపోయింది. కుటుంబ పరిస్థితులు బాగోలేక పని చేయాల్సి వచ్చింది.

ఆ రోజు రామయ్యకి జీవితం ఒక పూర్తి విరామం (.) లాగా అనిపించింది.
అతనికి అనిపించింది – "ఇక్కడితో నా కలలు ముగిసిపోయాయి" అని.

కానీ కాలం గడిచింది.
రామయ్య చిన్న పనులు చేస్తూ ముందుకు సాగాడు.
ఒక పని... మరో పని... మరో అవకాశం...

అతని జీవితంలో ఒక్కో చుక్క (...) లాగా చిన్న చిన్న అవకాశాలు వచ్చాయి.
ఆ చుక్కలు ఆగిపోవడం కాదు...
కొనసాగడానికి సంకేతాలు.

కొన్ని సంవత్సరాల తరువాత రామయ్య మంచి వ్యాపారి అయ్యాడు.
అతను అప్పుడే గ్రహించాడు –

"ఒక చిన్న చుక్క పెద్ద వాక్యాన్ని ఆపగలదు.
కానీ చాలా చుక్కలు కలిస్తే కథ కొనసాగుతుంది."

జీవితంలో ప్రతి ముగింపు కూడా నిజంగా ముగింపు కాదు.
అది ఒక కొత్త ప్రారంభానికి తలుపు మాత్రమే.

అందుకే రామయ్య తన పిల్లలకు ఎప్పుడూ చెప్పేవాడు –

"జీవితంలో ప్రతి 'ముగింపు' వెనక ఒక కొత్త 'ప్రారంభం' దాగి ఉంటుంది."

రచన తేరాల రాజేంద్ర ప్రసాద్
9297109223
రత్నలహరి సీఈవో

# మాల్‌ఖానా భద్రతా ఏర్పాట్లపై జిల్లా జడ్జి తనిఖీ

నవతరం –శ్రీకాకుళం

జిల్లా వ్యాప్తంగా వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను ఒకే చోట అత్యంత భద్రంగా నిల్వ చేసేందుకు ఏర్పాటు చేస్తున్న మాల్ ఖానాను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, అదనపు ఎస్పీ శ్రీనివాసరావు కలసి సందర్శించారు. నగరంలోని వంశధార పాత క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన ఈ తాత్కాలిక ప్రత్యేక కేంద్రాన్ని శనివారం వారిద్దరూ స్వయంగా భవనం లోపల, బయట కలియతిరిగి భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రధానంగా తలుపుల పటిష్టత, సీసీ కెమెరాల నిఘా తీరును తనిఖీ చేశారు. భవనం సంరక్షణ కోసం కేటాయించిన సిబ్బంది వివరాలను ఏఎస్పీని అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా ఎటువంటి అజాగ్రత్తకు తావు లేకుండా పకడ్బందీగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. బిల్డింగ్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న ఎస్.ఐ పి.నరసింహమూర్తికి భద్రత విషయంలో పలు కీలక సూచనలు చేశారు. ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను నిల్వ చేసిన పద్ధతిపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డి.ఇ మురళీమోహన్, ఆర్ అండ్ బి అధికారులైన డి.ఇ ధనంజయ్, ఈ.ఈ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. భవనంలో అవసరమైన మరిన్ని మౌలిక సదుపాయాలను, ఫినిషింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.

# దానేటి దాతృత్వం గొప్పది

నవతరం –ఆమదాలవలస

జిల్లాలో ఏదో ఒక చోట... ఏదో ఒక రూపంలో దానేటి శ్రీధర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ దానేటి శ్రీధర్ చేస్తున్న సేవా కార్యక్రమాలు కన్పిస్తూనే, విన్పిస్తూనే ఉంటాయని ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. సుమారు రూ. 8.5 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన మంచినీళ్ల వాటర్ ట్యాంకర్‌ను ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌తో కలసి డాక్టర్ దానేటి శ్రీధర్ అధికారులకు అధికారికంగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ తన దానేటి శ్రీధర్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో కొనుగోలు చేసిన వాటర్ ట్యాంకర్‌ను ఆముదాలవలస మున్సిపాలిటీకి అందజేశారని తెలిపారు. ప్రజల ఆరోగ్యం కోసం స్వచ్ఛమైన తాగునీరు ఎంతో అవసరమని తెలిపారు. పట్టణంలో నీటి అవసరాలు ఉన్న ప్రాంతాలకు ఈ ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేయడం సులభమవుతుందని చెప్పారు. సమాజ సేవలో భాగంగా దానేటి శ్రీధర్ చారిటబుల్ ట్రస్ట్ ముందుకు వచ్చి ఈ ట్యాంకర్‌ను అందించడం అభినందనీయమని కొనియాడారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ గారు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సేవలు అందించడంలో తమ ట్రస్ట్ ఎప్పటికప్పుడు సహకరిస్తుందని తెలిపారు. ఈ వాటర్ ట్యాంకర్ ద్వారా పట్టణ ప్రజలకు వేసవికాలంలో తాగునీటి సమస్య కొంతవరకు పరిష్కారం కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమదాలవలస మున్సిపాలిటీకి తాగునీటి ట్యాంకర్ అవసరాన్ని గుర్తించి అక్టోబరు నెలలోనే తనకు ఎమ్మెల్యే కూన రవికుమార్ ట్యాంకర్ కోరడం జరిగిందని డాక్టర్ శ్రీధర్ తెలిపారు. వేసవి దృష్టిలో పెట్టుకుని అక్టోబరు నెలలోనే ట్యాంకర్ కోరారంటే రవికుమార్ దూరదృష్టి, పరిపాలన దక్షతకు ఇది నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎక్స్ చైర్మన్ తమ్మినేని గీత విద్యాసాగర్, కూటమి ముఖ్య నాయకులు, మున్సిపల్ కమిషనర్ ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




# ఏపీ అంటే డ్రగ్స్‌కు అడ్డా..

మొదటి పేజీ తరువాయి

పార్టీ ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ డ్రగ్స్ తీసుకుంటూ పోలీసులకు పట్టుబడి వారి పైనే కాల్పులకు తెగబడటం అత్యంత దారుణమైన విషయమని వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు అన్నారు. సోమవారం ఆయన పలాసలో తన నివాసంవద్ద మాట్లాడుతూ, ఇంటింటికి రేషన్ బియ్యం డోర్ డెలివరీ పథకాన్ని రద్దుచేసిన కూటమి ప్రభుత్వం డ్రగ్స్ డోర్ డెలివరీ కి మాత్రం పచ్చ జెండాఊపు తుందని బమ్మిడి దుర్యోధనరావు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ద్వందనీతిని ప్రదర్శిస్తుందన్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ' యాంటీ డ్రగ్స్' పేరుతో సైకిల్ యాత్రలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ఆర్భాటం చేస్తుందని, కానీ మరోవైపు తమ సొంత పార్టీ ఎంపీలే డ్రగ్స్ సేవిస్తూ పోలీసులకు పట్టుబడటం వారి ద్వంద్వనీతికి నిదర్శమని ఆయన విమర్శించారు. డ్రగ్స్ ముఠాను పట్టుకునేందుకు పోలీసులు జరిపిన రైడ్ లో ఎంపీ మహేష్ యాదవ్ ముఠా వారిపైనే కాల్పులకు తెగబడటం చూస్తే ఒక ప్రజా ప్రతినిధిగా సమాజానికి ఏమి సందేశం ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు. సమాజంలో శాంతి భద్రతల కోసం పాటుపడుతున్న పోలీసుల పైన కాల్పులు జరపడం అత్యంత దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డ్రగ్స్ కల్చర్ హెచ్ మీరు పోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. టిడిపి అంటే తెలుగుదేశం పార్టీ కాదని.. తెలుగు డ్రగ్స్ పార్టీగా మరిందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియా కరాళ నృత్యం చేస్తూ యువతను నిర్వీర్యం చేస్తుందని, అంతేగాక అడ్డు అదుపు లేకుండా పోలీసుల కళ్ళు కప్పి చుట్టూ పక్క రాష్ట్రాల నుంచి ఏపీకి పెద్ద మొత్తంలో గంజాయిని టిడిపి నాయకులు, కార్యకర్తల ద్వారానే రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో హోమ్ డెలివరీ జరుగుతోందని ఆయన ఆరోపించారు. అలాగే డ్రగ్స్ కూడా విచ్చలవిడిగా, ఎక్కడపడితే అక్కడ లభ్యమవుతున్నాయన్నారు. యువత డ్రగ్స్ కు బానిస గా మారి ఎదుటివారి ప్రాణాలు తీయడానికి, హత్యలు చేయడానికి డ్రగ్స్ కు బానిసైనా వారు వెనుకాడడం లేదన్నారు. ఒక పార్లమెంట్ సభ్యుడు అందరికీ ఆదర్శంగా ఉండవలసిన వ్యక్తి డ్రగ్స్ సేవిస్తూ .. ఒక డ్రగ్స్ ముఠాను తయారుచేసి సమాజంలో శాంతిభద్రత లకు విఘాతం కలిగేలా వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. డ్రగ్స్ మాఫియా రాష్ట్రంలోని విద్యాసంస్థలకు తమ దందాకు కేంద్రంగా చేసుకొని ఉన్నత విద్యాసంస్థల సమీపంలోనే బడ్డీలు, కొన్ని షాపులు లలో డ్రగ్స్, గంజాయి విక్రయాలు అక్రమంగా సాగిస్తున్నారని బమ్మిడి దుర్యోధనరావు వివరించారు. సిగరెట్లు, చాక్లెట్లు, చూయింగ్ గమ్, పౌడర్ రూపంలో ఈ డ్రగ్స్ మాఫియా ముఠా విక్రయిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ చేత రాజీనామా చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.

# గ్రామ్ జీ చట్టంపై షర్మిలా తీవ్ర విమర్శలు

మొదటి పేజీ తరువాయి

చట్టంలో ఏ పనులు చేయాలన్నది ఢిల్లీలో కూర్చున్న కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుందని విమర్శించారు. గ్రామాల్లో అవసరమైన పనులపై కేంద్రానికి అవగాహన ఉండదని అన్నారు. మన్రేగా కింద సగటున 52 రోజుల పనికూడా కల్పించలేని కేంద్రం ఇప్పుడు 125 రోజుల పని ఇస్తామని చెప్పడం పచ్చి అబద్ధమని షర్మిలా వ్యాఖ్యానించారు. కొత్త చట్టం వల్ల రాష్ట్రంపై 40 శాతం నిధుల భారం పడుతుందని, ఆంధ్రప్రదేశ్‌కు సుమారు రూ.5 వేల కోట్ల అదనపు భారమవుతుందని చెప్పారు. ఇప్పటికే అప్పుల్లో ఉన్న రాష్ట్రానికి ఇది మరింత భారం అవుతుందని పేర్కొన్నారు. గ్రామ్ జీ చట్టానికి మద్దతు ఇచ్చిన టీడీపీ, జనసేనపై కూడా ఆమె తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర హక్కుల కోసం మోడీ కాలర్ పట్టుకుంటామని చెప్పిన జగన్ ఇప్పుడు మోడీకి బానిసగా మారారని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు అన్నీ కేంద్రానికి గులాం గురి చేసే పార్టీలుగా మారాయని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మన్రేగా చట్టాన్ని పునరుద్ధరించి, ఉపాధి హామీ రోజులను 150 రోజులకు పెంచుతామని షర్మిలా హామీ ఇచ్చారు. గ్రామ్ జీ చట్టం రద్దయ్యే వరకు కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మార్పు రావాలంటే ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు.

# పరీక్షా కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

నవతరం –శ్రీకాకుళం




పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణ తీరును జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగరంలోని భాష్యం పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష గదుల్లోకి వెళ్లి విద్యార్థులకు కల్పించిన వసతులను స్వయంగా పర్యవేక్షించారు. పరీక్ష రాస్తున్న విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గదుల్లో తగినంత వెలుతురు, ఫ్యాన్లు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా వేసవి దృష్ట్యా తాగునీటి లభ్యతపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతం, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిఘా ఉంచాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో విద్యాశాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# వాహన చోరీలపై ప్రత్యేక నిఘా
# వేగంగా కేసుల నమోదు

- ప్రత్యేక దర్యాప్తు బృందాలతో చోరీ బైకుల ఛేధనకు చర్యలు.
- ప్రజలు వాహనాలను పార్క్ చేసే సమయంలో తాళాలు వేసి జాగ్రత్తలు పాటించాలి.
- బైక్ చోరీలపై వివరాలను వాట్సాప్ ద్వారా కూడా తెలియజేయవచ్చు.
- జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్.



నవతరం –శ్రీకాకుళం

శ్రీకాకుళం జిల్లాలో బైక్ చోరీలు పై కేసులు నమోదు చేయ్యట్లేదని పత్రికల్లో ప్రచురితమైన వార్తలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని,జిల్లాలో వాహన చోరీలపై ప్రత్యేక నిఘా తోపాటు వేగంగా కేసుల నమోదు చేసి,వాహన చోరీలను అరికట్టేందుకు పోలీసు శాఖ నిరంతరం పటిష్ట చర్యలు చేపడుతోందని జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్, గారు స్పష్టం చేశారు.ఈ మేరకు సోమవారం ఒక పత్రిక ప్రకటన జారీ చేస్తూ వాహన చోరీలపై అందిన ఫిర్యాదులపై తక్షణమే కేసులను నమోదు చేసి, నేరాలకు పాల్పడే నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం దర్యాప్తుతో కేసులను ఛేదించి,రికవరీ చేసిన ద్విచక్ర వాహనాలను బాధితులకు అందజేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా వాహన చోరీల నివారణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాలపై తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.
బైక్ చోరీలకు సంబంధించిన ఫిర్యాదు వచ్చిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఆలస్యం లేకుండా కేసులు నమోదు చేసి, పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి చోరీకి గురైన బైకులను గుర్తించి తిరిగి యజమానులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. వాహన చోరీలకు పాల్పడే నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గత ఏడాదిలో మోటార్ సైకిల్ దొంగతనం సంబంధించిన 103 కేసులు నమోదు అవ్వగా వాటిలో 72 కేసులు, అదేవిధంగా 2026 సం.లో ( ఇప్పటి వరకు)11 కేసులు నమోదు కాగా అందులో 4 కేసులు ఛేదించి,ఆయా కేసుల్లో ముద్దాయిలను అరెస్టు చేసి రికవరీ చేసిన బైకులు బాధితులకు తిరిగి అందజేసినట్లు తెలిపారు.
కొన్ని సందర్భాల్లో వాహన యజమానులు తమ వాహనాలను ఎక్కడ పార్క్ చేశారో మర్చిపోవడం, లేదా సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల కూడా వాహనాలు కనిపించకపోవడం జరుగుతుందని తెలిపారు.
ఇలాంటి సందర్భాల్లో కూడా పోలీసులు వెంటనే స్పందించి విచారణ చేపడుతున్నారని చెప్పారు.
అదేవిధంగా జిల్లాలోని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిఘా మరింత పెంచినట్లు, పోలీసు పెట్రోలింగ్‌ను కూడా బలోపేతం చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. వాహన చోరీలను అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు తమ వాహనాలను పార్క్ చేసే సమయంలో తప్పనిసరిగా తాళాలు వేసి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా రానున్న వేసవి కాలంలో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాల భద్రతపై ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు.
వాట్సాప్ ద్వారా – వాహన చోరీలకు సంబంధించి సమాచారం ఇవ్వడానికి సంప్రదించవలసిన నెంబర్లు:
ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లయితే బాధితులు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని, అలాగే వాట్సాప్ ద్వారా కూడా సమాచారం అందజేయవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు.
శ్రీకాకుళం జిల్లా ఎస్పీ: 6309990800
అదనపు ఎస్పీ (క్రైమ్): 6309990803
పోలీస్ కంట్రోల్ రూమ్: 6309990933.
చోరీకి గురైన ద్విచక్ర వాహనాల పూర్తి వివరాలు, వాహన యజమాని వివరాలు, వాహనం పార్క్ చేసిన ప్రదేశం తదితర సమాచారం పై నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపితే తక్షణమే స్పందించి కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజల సహకారంతో వాహన చోరీలను పూర్తిగా అరికట్టేందుకు పోలీసు శాఖ కట్టుబడి పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు.

# పోస్టల్ డివిజన్ పరిధిలో తపాలా అదాలత్

**నవతరం-శ్రీకాకుళం**

శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ పరిధిలో ని తపాలా వినియోగదారుల యొక్క వ్యక్తిగత ఫిర్యాదులు మరియు సమస్యలు పరిష్కరించు నిమిత్తం మెరుగైన సేవలు అందించుటలో భాగంగా ఈ నెల తేదీ. 26-03-2026 (గురువారం) మధ్యాహ్నం 2 .00 గంటలకు సూపరింటెండెంట్ వారి కార్యాలయం, రెల్ల వీధి, ఎస్.ఎస్.ఆర్ డిగ్రీ మరియు పీజీ కాలేజ్ దగ్గర శ్రీకాకుళం-532001నందు గల తపాలా కార్యాలయంలో సూపరింటెండెంట్ వారిచే తపాలా అదాలత్ నిర్వహిస్తున్నట్లు వి. హరిబాబు, పోస్టల్ సూపరిండెంట్ శ్రీకాకుళం డివిజన్ వారు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. తపాలా సేవలకు సంబంధించిన ప్రత్యేక వ్యక్తిగత ఫిర్యాదులు ఈ అదాలత్ నందు చర్చించబడతాయని, శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ పరిధిలోని తపాలా వినియోగదారులు తమ సమస్యలు మరియు ఫిర్యాదులు తేదీ 25 .3 .2026 లోగా "తపాలా అదాలత్ "అనే శీర్షికతో వి. హరిబాబు, సూపరింటెండెంట్ ఆఫ్ ఆఫీసెస్ శ్రీకాకుళం, పోస్టల్ డివిజన్- శ్రీకాకుళం-532001 అనే చిరునామాకు పంపవలసిందిగా కోరి ఉన్నారు. సదరు ఫిర్యాదులు గడువు తేదీ తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని, ఫిర్యాదులు వ్యక్తిగతంగా కూడా తీసుకొని అదాలత్ కు హాజరు కావచ్చునని ఆర్థిక అవకతవకలు సంబంధించిన విషయాలపై ఫిర్యాదులు తీసుకొనబడవని ఆయన తెలిపి ఉన్నారు.

# "త్యాగాలకు ప్రతిరూపం పొట్టి శ్రీరాములు"



**నవతరం-శ్రీకాకుళం**

త్యాగ నిరతికి నిలువెత్తు ఆకృతి అమరజీవి పొట్టి శ్రీరాములు అని హర్షవల్లి లయన్స్ క్లబ్ ఫాస్ట్ ప్రెసిడెంట్, ఇంటర్నేషనల్ డి.సి వావిలపల్లి జగన్నాథనాయుడు అన్నారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక గాంధీ మందిరం, స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పుష్పాభిషేకం చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయుడు పాల్గొని మాట్లాడారు.ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కోసం 56రోజుల పాటు ఆమరణ నిరాహారదీక్ష చేసి అసువులు బాసిన శ్రీరాములు చిరస్మరణీయుడని వక్తలు పేర్కొన్నారు. రేపటి పౌరులైన బాలలు పొట్టి శ్రీరాములు జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. లయన్సు వైస్ చైర్మన్ తర్లాడ అప్పలనాయుడు, నెహ్రూ యువకేంద్ర విశ్రాంత కోఆర్డినేటర్ ఎం.నాగేశ్వరరావు, స్వీప్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు కొమ్ము రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# చిరస్మరణీయులు "హనుమంతు జగన్నాధ దొర"

- ప్రజా సేవ పట్ల అంకితభావం కలిగిన వ్యక్తి
- ప్రముఖ వైద్యురాలు డా.పైడి.సింధూర

**నవతరం-శ్రీకాకుళం**

చిరస్మరణీయులు హనుమంతు జగన్నాధ దొర అని, ప్రముఖ వైద్యురాలు డా.పైడి.సింధూర అన్నారు. విశ్రాంత డిజిపి దొర ఇకలేరనే విషయం విదితమే. హైదరాబాద్ లో ఆయన భౌతికాయానికి పూలమాలలతో అంజలి ఘటించారు. ఈ అసందర్భంగా ఆమె సోమవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ శ్రీకాకుళం జలుమూరులో పుట్టిపెరిగి, ఉన్నతమైన స్థానాలను చేపట్టి ప్రజాభిమానం పొందిన మహోన్నత వ్యక్తి హనుమంతు జగన్నాధ దొర అని, ఆయన మరణం యావత్ తెలుగు రాష్ట్రాల ప్రజలు, అధికారులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ఆయన మా కుటుంబానికి అత్యంత సన్నిహితులని, అందరి క్షేమం కోరుకునే మంచి మనిషని కొనియాడారు. సహోద్యోగులు ఆయనను క్రమశిక్షణ, దార్శనికత, వ్యూహాత్మక వ్యక్తిగా ప్రశంసించేవారని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పోలీసింగ్‌పై శాశ్వత ముద్ర వేశారని, తిరుగుబాటును ఎదుర్కోవడంలో ఆయన నాయకత్వం, సంస్కరణల పట్ల నిబద్ధత, ప్రజా సేవ పట్ల అంకితభావం తరతరాలుగా అధికారులు, పౌరులకు స్ఫూర్తినిస్తాయన్నారు. సత్యసాయి బాబా జీవితాంతం భక్తుడైన ఆయన అనుబంధం 1966లో ప్రారంభమైందని, పదవీ విరమణ తర్వాత, ఆయన శ్రీ సత్యసాయి ట్రస్ట్‌కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కన్వీనర్‌గా పనిచేసి ఆధ్యాత్మిక సేవలో తనువుచాలించటం బాధాకరమన్నారు. ఇంటెలిజెన్స్ చీఫ్, డీజీపీగా ఆయన చేసిన అమూల్యమైన సేవలను గుర్తు చేసుకున్నారు. పోలీసు శాఖలో సంస్కరణలను ప్రవేశపెట్టడానికి, ముఖ్యంగా స్నేహపూర్వక పోలీసింగ్‌ను ప్రోత్సహించడంలో దొర చేసిన కృషిని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రత్యేకంగా ప్రస్తావించారని, బౌతికంగా మన మధ్యలేకపోయినా, ఆయన గుర్తులు శాశ్వతమన్నారు.



# ఘనంగా పైడితల్లి అమ్మవారి జాతర

**నవతరం-పొందూరు**



స్థానిక శ్రీ పైడితల్లి అమ్మవారి 41వ జాతర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ప్రారంభమైన ఈ వేడుకలు మంగళవారం రాత్రి వరకు కొనసాగుతాయి. ఉత్సవ విగ్రహానికి తిరువీధి జరిపారు. యాత్ర మూడు రోజులు అమ్మవారు రోజుకొక అలంకరణతో దర్శనమిస్తున్నారు. వేద పండితులచే అమ్మవారి ఆవాహన కార్యక్రమం, రుద్రాభిషేకం, సహస్రనామాలతో కుంకుమార్చనను జరుపుతున్నారు. వాగ్దేవి నాటక కళాపరిషత్ (పెద్దపాడు) వారిచే నిర్వహించిన"సారంగధర" జానపద నాటక ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. సోమవారం తారక్ ఈవెంట్స్ వారిచే ప్రత్యేక డాన్స్ హంగామా, మంగళవారం రాత్రి రాష్ట్ర స్థాయి నటీనటుల కలయికతో సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శనను ఏర్పాటు చేశారు.పి.కృష్ణచైతన్య, జి.రామబ్రహ్మారెడ్డి ఒకటవ, రెండవ హరిశ్చంద్ర పాత్రలను పోషిస్తారు.చంద్రమతి పాత్రను నంది అవార్డు గ్రహీత కె.వి.పద్మావతి, నక్షత్రక పాత్రను ఉయ్యూరు దుర్గాప్రసాద్ పోషిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు జాక రామారావు నిర్వహిస్తున్నారు. ఇదే రోజు మధ్యాహ్నం అమ్మవారి ఆలయంలో భారీ అన్న సమారాధన జరుగుతుంది.

### తెలుగు చలనచిత్ర దర్శకుల సంఘంలో గెలిసిన

# మన సిక్కోలు వాసి రమణ మొగిలి

**నవతరం-శ్రీకాకుళం**



శ్రీకాకుళం జిల్లా, కొత్తూరు కు చెందిన మొగిలి రమణ చిత్ర పరిశ్రమలో దర్శకులుగా ఈ వర్షం సాక్షిగా, ధర్మస్థలి, ఈ మధ్యకాలంలో వచ్చి పజాదరణ పొందిన జనతాబార్ చిత్రం..ఇలా తెలుగుతో పాటు హిందీ, తమిళ్, భోజిపురి, ఒడియా భాషల్లో విజయాలందుకున్నారు,

ఈ నెల 8న జరిగిన తెలుగు దర్శకుల సంఘం ఎన్నికలో ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబెర్ గా వి.ఎన్ ఆదిత్య, సాయి రాజేష్ ప్యానెల్ లో మంచి మెజారిటీ గెలుపొందిన సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి గారు కమిటీని అభినందించారు. జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున అభినందనలు తెలుపుతున్నారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలి

**నవతరం -శ్రీకాకుళం**

ప్రజల నుండి ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కు వచ్చిన వినతులను క్షేత్ర స్థాయిలో విచారించి అర్జిదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలి జిల్లా సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(మీ కోసం) కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సహాయ కలెక్టర్ దొనక పృథ్వీ రాజ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు ఎన్.కిరణ్ కుమార్, జెడ్పీ సి ఈ ఓ పి.సత్యనారాయణ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.అర్జీదారుల సమస్యలు సావధానంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆయా సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నందున జాప్యంలేకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను జె సీ ఆదేశించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 117 వినతులు నమోదయ్యాయి. అధికంగా రెవెన్యూ కి సంబంధించి 23 వినతులు, పంచాయతీ రాజ్ -13, వ్యవసాయ శాఖ -13, సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూలన)-12 దరఖాస్తులు అందాయి.

### రెవెన్యూ క్లినిక్ ను సందర్శించిన జెసి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించిన అనంతరం జడ్పీ సమావేశ మందిరం ఆవరణలో ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్ లను జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సందర్శించారు. ప్రజల నుండి వచ్చిన భూ సంబంధిత సమస్యల పరిష్కార స్థితిగతులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు డైరెక్టర్ బి. లవరాజ్, కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ డి.పద్మావతి, జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి వి ఎస్ ఎస్ ఎల్ ప్రసన్న, జిల్లా పంచాయతీ రాజ్ పర్యవేక్షక ఇంజనీర్ కె.వి.నాయుడు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా పర్యవేక్షక ఇంజనీర్ పి.సుధాకర్ బాబు, జిల్లా పంచాయతీ అధికారి గోపి బాల, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె.త్రినాథ రావు, భూగర్భ గనుల శాఖ ఉప సంచాలకులు సి.మోహన్ రావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా,అనిత, సర్వశిక్షా అభియాన్ ఏ పి సి పి.వేణుగోపాల్, జిల్లా ఉపాధికల్పన అధికారి కె. సుధా, మెప్మా పథక సంచాలకులు ఎస్.వెంకట రావు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కె.సూర్య ప్రకాష్, ఎస్.సి కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ వి.వినాయకం, జిల్లా కార్మిక శాఖ అధికారి కె.అజయ్ కార్తికేయ, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ రావు, ఉద్యాన వన శాఖ సహాయ సంచాలకులు వర ప్రసాద్, ఇతర జిల్లా అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు పదోన్నతుల అవకాశాలు

**నవతరం-శ్రీకాకుళం**

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని అన్ని జిల్లా పరిషత్ ప్రభుత్వ మరియు మున్సిపల్ యాజమాన్యముల పాఠశాలలో పనిచేయుచున్న ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాసంచాలకులు ఆంధ్ర ప్రదేశ్ అమరావతి వారి ఆదేశాల మేరకు అర్హత గల ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ మరియు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పదోన్నతులు కల్పించుటకు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లు మరియు తత్సమాన కేటగిరీల తాత్కాలిక సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖ అధికారి వారి వెబ్ సైట్ నందు పొందుపరచినట్లుగా జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రవిబాబు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

అర్హత కలిగిన ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీకాకుళం వారి వెబ్ సైట్ లింక్ (https://www.sites.google.com/site/deosklorg/) లో ఉన్న పదోన్నతుల తాత్కాలిక సీనియారిటీ జాబితా పై ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల తేదీ 23. 3 .2026 లోగా ఉదయం 10 గంటల 30 నిమిషాలు నుండి సాయంత్రం ఐదు గంటల లోపు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీకాకుళం వారి కార్యాలయం తగిన ధ్రువీకరణ పత్రాలు ఆధారాలతో సమర్పించాలని ఆయన కోరారు.

గమనిక ప్రతి ఉపాధ్యాయులు తన యొక్క టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (TIS) డేటాను మరియు సంబంధిత ప్రధాన ఉపాధ్యాయులు డి డి ఓ ఎంఈఓ లు ధృవీకరించిన డిక్లరేషన్ ఫారంలను పిడిఎఫ్ ఫార్మేట్ లో తమ వద్ద పూర్తి భద్రతతో బాద్యతతో భద్రపరచవలెనని తెలియజేశారు.

# 24న ఎస్.సి కమిషన్ సభ్యుని రాక

**నవతరం-శ్రీకాకుళం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారాం ఈ నెల 24వ తేదీన శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ఉదయం 10:30 గంటల నుండి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎస్సీ సామాజిక వర్గ ప్రజలు, వివిధ సంఘాల నుండి వినతులు, ఫిర్యాదులను స్వీకరిస్తారని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం మున్సిపల్ అధికారులతో సమావేశమై, సాయంత్రం ఎస్సీ సంక్షేమ హాస్టళ్లు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను సందర్శిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**